# ఎటు చూస్తే అటు చీకటి

అలగోల పొలగోలుగా ఉంది ఇల్లంతా. చుట్టపక్కాలతో నిండి కిటకిట లాడుతూంది. అప్పుడే నాలుగ్గంటల బండిలో దిగిన సుందరరాజమ్మ 'అయ్యో నా కూతురా....' అని అంటూ కూలిపోయి ఏడువసాగింది.

అరుగు కానించివున్న 'రాజమ్మ' శవానికప్పుడే పినమామగారు బుచ్చిరామయ్య దగ్గర ఉండి స్నానం చేయిస్తున్నారు.

బురదలో దేకుతూ, కడుపు బాదుకుంటూ 'సుందర రాజమ్మ 'కూతురా! కూతురా!' అని వాపోతూండగా శవస్నానాదికాల్ని కొద్దిసేపు ఆపించవలసి వచ్చింది.

అరుగుమీద మూలన నులకమంచంమీద ముఖం కప్పుకుని 'తారకం' సొమ్మసిల్లినట్టు పడిపోయాడు. అతనికీ అత్తగారు రావటంకానీ, ఈ జరుగుతున్న తతంగంకానీ, ఏదీ తెలిసినట్టు లేదు. నులకమంచం మీదికి ఎండతీక్షణంగా వచ్చి కమిచీతో బాదినట్లు బాదుతోంది తారకాన్ని.

బుచ్చిరామయ్యగారు ప్రొద్దుపోతూండడాన్ని గమనిస్తూ 'అమ్మా! రాజమ్మకి జరగవలసిన చివరి పనులన్నీ శ్రద్ధతో కానిచ్చుకుందాం; ఆ హంస లేచిపోయినప్పుడు పిచ్చిదానా, ఇక ఈ కట్టె నీ రాజమ్మ ఎందుకవుతుందమ్మా? లే-మా అమ్మవు కదూ-నీ కీకడుపుకోత రాసివుంది' అని ఓదార్చుతూ, ఆవిడ్ని జబ్బ పుచ్చుకుని గుమ్మందాకా నడిపించుకు వెళ్ళటం అట్లా ఆవిడ మూడుమాట్లు రాజమ్మకి స్నానాదికాలు పూర్తిగానివ్వకుండా అడ్డుపడ్డం జరిగాక, ఆయన మళ్ళీ అన్నారు-

'చూడు చెల్లెమ్మా, చూడు. ఆ దిక్కుమాలినవాడు తారకం. ఎట్లా ఎండలో మాడిపోతున్నాడో, వాడ్ని కాస్త సముదాయించు' అంటూ దృష్టి మళ్ళించ యత్నించారు. ఈ మాటలు విన్న ప్రసూన అటువైపు దైన్యంగా చూసింది.

'నా కన్నకడుపు కోసుకుపోయాక నా కింవెరు కావాలర్రో-నా తల్లిని పొట్ట పెట్టుకున్నాక నా కింకెవరు కావాలర్రో! లోకంలో ఇంత మంది ఉండగా నా కూతురే కావాల్సొచ్చిందిరా దేముడా! నా కడుపు కాల్చేశావురో-దేముడా! అంటూ రాగయుక్తంగా ఆవిడ తల, కడుపు, రొమ్ములు, బాదుకుంటూ ముఖమంతా వికృతం చేసుకుని నేలమీద దొర్లుతూ ఏడువసాగింది. 'ఊరుకో, ఊరుకో' అని ఎవరో ఒకరు అంటూనే ఉన్నారు. ప్రక్కన కూర్చుని, అరవిచ్చిన తెల్ల కలువరేకుల కొసలనుండి క్రిందకు దిగజారుతూండగా, 'అక్కయ్యా!' అంటూ సన్నగా మూలుగుతూ, ఏడుస్తున్న దేవకన్యలాగున్న 'ప్రసూన' మధ్య మధ్య తల్లియొక్క జారిపోయిన పవిటను పైకి లాగి సర్దుతోంది.

బుచ్చిరామయ్య ఒక ప్రక్కన ఏడిచేవాళ్లను సముదాయించుకుంటూ పైపనులు వాళ్ళకూ వీళ్ళకూ పురమాయిస్తున్నాడు. మధ్య మధ్యన చిన్న చిన్న కేకలు కూడా వినవస్తున్నాయి.

రాజమ్మకి స్నానం పూర్తయింది. పాపిట చెరిగిపోయి జుట్టు పాయలు పాయలుగా నీళ్లోడుతూ ముఖంమీద పడుతుండగా, వ్రాలిపోతూన్న బుచ్చిరామయ్య 'నాన్నా! కాస్సేపు ఇక్కడ నిల్చో-నీ రాజమ్మ వెళ్ళిపోతోంది. దగ్గర నుంచోవూ, లే!' అని 'ప్రసూన' నుద్దేశించి 'వాడ్ని లేపమ్మా, చూసుకుంటాడు' అని అరుగుమీద నులక మంచంలోని తారకాన్ని పిలిపించటం కోసం కుడిచేతిలోని రాజమ్మ శిరస్సును ఎడమచేతిలోనికి మార్చుకుని కుడిచేత్తో ముఖంమీద చెమటను మీటి విదిపాడు.

మాసినగడ్డం నలిగిన ముఖం నిద్రలేని కళ్ళతో పైకి ఎగ్గట్టిన పంచెతో ఎండలో నిల్చున్న బుచ్చిరామయ్య, అతడి చేతిలో పీచురేగిన జుట్టుతో వాలిపోతూ మూతలుపడ్డ కళ్ళతో నల్లబడిపోయి తడిసి ముద్దగట్టిన రాజమ్మ శవం-ఈ దృశ్యాన్ని మంచంమీంచి లేవబోతూ చూసిన తారకం 'బాబోయ్' అని పెద్ద కేకేసి భళ్ళున వెనక్కు తిరిగి పడ్డాడు నులక కుక్కిలో. ఇద్దరు ముగ్గురటు పరిగెత్తారు.

చిన్న అరుగుమీద చూరు నీడపడి తారకాన్ని కప్పింది. దిగువున తల్లి ప్రక్కకు 'అక్కా' అంటూ దుఃఖిస్తూన్న 'ప్రసూన' ధైర్యం చేసి బావ వైపుకు పోలేకపోయింది.

బ్రాహ్మణులొచ్చారు. అవతల శవానికి తంతు పూర్తవుతోంది. బుచ్చిరామయ్య మళ్ళీ ఆదేశించాడు. ఎవరైనా వెళ్ళి రాజమ్మ బిడ్డను తీసుకురండర్రా అని. "ఎక్కడుంది? ఎక్కడుంది? అన్నారెవరో అక్కడున్న మనుష్యుల్లో ఒకరిద్దరు.

బుచ్చిరామయ్య ప్రసూనకేసి చూస్తూ "పక్కవాళ్ళింట్లో దాసీది ఒళ్ళో పెట్టుకుని కూర్చుంది. ఎవరైనా త్వరగా వెళ్ళాలి."

ప్రసూన లేచి విసురుగా దొడ్డి గుమ్మం దగ్గర నిల్చొని తొంగి చూసింది. పసిపిల్ల దాసీదాని గుడ్డల్ని పీకుతూ ఒక చేత్తో దాని మెళ్ళోని ఎర్రటి పూసల్ని అందుకుని వాటిని నోట్లో పెట్టుకొనటానికి యత్నిస్తుండగా 'ప్రసూన' ఆ పిల్లని చేతుల్లోకి తీసుకుని గిరుక్కున

వెనక్కు మళ్ళింది. ఆ మళ్లటం ఎట్లా మళ్ళిందో, ఆ బిడ్డకేసి ఎట్లా చూసిందో, ఆ పక్క గుమ్మం నుంచి రాజమ్మ శవం ఉన్న చోటువరకూ ఎట్లా నడిచిందో ఆ నడకను ఆదృష్టిని అప్పటి ఆమె మనస్సును సహజంగా వర్ణించటానికి మాటలు చాలవు.

ప్రసూన చంటిబిడ్డ నెత్తుకుని వచ్చేసరికి బుచ్చిరామయ్యగారు 'తారకాన్ని' లేవదీస్తున్నారు.

చెరువులోంచి గట్టుకు పెరికి పారేసిన తామరపూరేకులా వాడి, వడిలిపోయి వడదెబ్బ తిన్నట్లుందతని ముఖం.

ఎవరో ఒకర్తొక్కరే మెట్లెక్కి వస్తున్నారు. వచ్చి కాస్సేపు తారకాన్ని చూసి పల్కరించి శవాన్ని దీక్షగా చూసి 'ప్చ్' మని పెదవి విరిచి 'వాలాయతీ' తీర్చుకొని పోతున్నారు.

అట్లా పోతూన్న వాళ్ళలో కొంతమంది 'సుందర రాజమ్మ' ఏడుపు విన్నాక శవానికి ఏడుపు కొరత తీరిందని తృప్తిపడ్డారు. ఎందుకంటే యీ తల్లి రాకముందు నిశ్శబ్దంగా ఏమీ జరగనట్లే ఉంది ఆ ఇల్లు. తారకం రాజమ్మ ఒంట్లోంచి హంస లేచిపోయిందనగానే సొమ్మసిల్లినట్లు మంచానపడ్డాడు. అంతవరకూ ఆ తల్లి మంచంప్రక్కన ఉయ్యాలలో ఉన్న పసిపిల్ల నెవరో దూరంగా తీసుకెళ్లారు.

తారకం ఏడవలేదనటానికి వీల్లేదు. రాజమ్మలో కొనవూపిరి ఉన్నంత వరకూ అతను వైద్యుడి కాళ్ళదగ్గర తలకాయ బాదుకుని బ్రతికించమనీ భార్యా భిక్షపెట్టమనీ అనేక విధాల ప్రాధేయపడుతూనే ఉన్నాడు. 'బాబయ్యా' అంటూ బుచ్చిరామయ్య పాదాలను కన్నీటితో తడిపి వదలకుండా నేలమీద దొర్లినప్పుడు-చావు తెలివిలో రాజమ్మ చూపులిటే నిగుడ్చి ఉన్నై. ఆ చూపుల్లో ఎంత తృప్తి-తనకోసం-ఇంకొక్క నిముషంలో కట్టిగా మిగిలి తనకిక ఏమీలేని, పనికిరాని తనకోసం, కంటికీ మంటికీ ఏకధారగ నేలమీదపడి పొర్లే భర్తనే ఒక పురుషజీవి దుఃఖిస్తూండటాన్ని చూడగలిగిన తానెంత అదృష్టజీవిని-చాలు. ఇంతకంటే పెద్ద పెద్ద కోర్కెలు అనవసరం బహుశా ఇటువంటి తృప్తితోనే రాజమ్మ కన్ను మూసి ఉండాలి.

రాజీ! నా రాజీ-చూడు బాలయ్యా! నే నెట్లా బ్రతికేది బాబయ్యా! ఇంకేమీ అడగను-ఇదొక్కటే నా కోర్కె-నా రాజిని బ్రతికించు. ఎవ్వరూ బ్రతికించలేరా? ఓ జోలి బుజాన్నేసుకుని ఇల్లిల్లూ ముష్టెత్తుకునేనా బ్రతుకుతాం ఎవ్వరికీ అపకారం చెయ్యమని చెప్పు బాబయ్యా దేముడికి. అంటూ తారకం పిచ్చివాడిలా ఏడ్వటం మొదలుపెట్టాడు.

బుచ్చిరామయ్య ఉత్తరీయంతో కళ్లొత్తుకున్నాడు. దూరాన్నుంచి విన్న ఒకరిద్దరు 'మృత్యు వెరగని ఇంట్లోంచి తెమ్మన్న గుప్పెడు ఆవాల కథ'ను జ్ఞాపకానికి తెచ్చుకున్నారు.

సర్వాంతర్యామి చిన్ననవ్వునవ్వి ఉంటాడు. ఎవరో అనుకుంటున్నారు; ఎంతసేపు

ఏడ్చినా మగవాడి ఏడుపు ఏవేడుపు-రక్తికట్టదు. చూడు ఆ తల్లి ఒక్కర్తీ ఎంతబాగా ఏడ్చిందో...అందుకే కన్న కడుపుండాలంటారు.'

కొందరు తారకం ఏడవకపోవటం, శవం మీదపడి నానా అల్లరీ చెయ్యకపోవటం వల్ల అతడికి విచారం లేదనీ-ఈవాళ పెళ్ళాం చచ్చిందంటే మళ్ళీ రెండో నాటికి టింగురంగామంటూ పెళ్ళికొడుకేగా మగవాడు అంటూ ఏవో కూసుకున్నారు.

అతడి స్నేహితులొకరిద్దరు మాత్రం దగ్గర కూర్చుని వళ్ళునిమురుతూ మధ్య మధ్య తెలివిరావటానికి నీళ్లుజల్లుతూ అదీయిదీ అందిస్తున్నారు బుచ్చిరామయ్యకు.

బ్రాహ్మలపనికూడా పూర్తయింది. రాజమ్మ ముఖానికి బొట్టు కాళ్ళకు పసుపు పూసి పూలు జల్లి పుం స్త్రీ పడుచుకు చెయ్యవలసినదంతా చేశారు.

సుందరరాజమ్మ తెలివితప్పి పడిపోయింది. ప్రసూన చెంగుముఖాన రుద్దుకుంటూ చేతిలో పసిపిల్లను రొమ్ముల కదుముకుంటూ 'అక్కా' యని వలవలలాడింది.

బుచ్చిరామయ్య-అతని స్నేహితులిద్దరూ కలిసి తారకాన్ని నడిపించుకొస్తున్నారు. గుమ్మంలో నిల్చున్న ప్రసూన దుఃఖమే ఈ ఆకారం వహించిందా అన్నట్లున్న బావగార్ని చూడగానే పవిటచెరగు చుట్టి కెవ్వుమని వస్తూన్న కేక నదిమేలా నోట్లో కుక్కుకుంది. ఐనప్పటికీ ఆ సన్నటి కూత ఎల్లోనో తారకం కర్ణపుటాలకు సోకి చప్పున మెడ ప్రక్కకు త్రిప్పాడు.

తారకం చేయి చాపగానే ప్రసూన బిడ్డను చేతిలో ఉంచి ప్రక్కనున్న పాతగుడ్డను బిడ్డకుచుట్టుతూ బావగార్ని ఒక్కక్షణంసేపు చిన్న అరుగుమీద ఆపుచేసింది.

తరువాత తల్లి మృతహస్తాన్ని శిశువు శిరస్సుపై వుంచి, ఆ అభమూ శుభమూ ఎరగని పసిపిల్లచేత తల్లికొక చిన్నదండం పెట్టించి తిరిగి ప్రసూనకప్పగించేశారు.

తారకం కుంకం తీసుకుని రాజమ్మకు బొట్టుపెట్టి-పూలను హృదయం మీద ఉంచి తిరిగి రాబోతూండగా బుచ్చి రామయ్య శవం పాదాలకేసి చూపించాడు.

తారకం రెండు చేతులతో రాజమ్మ పాదాలను స్పృశించి కళ్ళకద్దుకున్నాడు. బుచ్చిరామయ్య చూడకుండా ముఖం దించేసుకున్నాడు. ప్రసూనచంకలోని బుల్లిపాపాయి కూడా తనవంతు మాతృఋణాన్ని చెల్లించే నిమిత్తమై పాలపీక నోట్లో ఉంచినా మానకుండా క్యావుమంది.

తెలివితప్పిన సుందరరాజమ్మ కోలుకొంటూ రాజమ్మ సవారీ సిద్ధమవుతూండటాన్ని చూసి మళ్ళీ విరుచుకుపడింది.

తారకం దూరంగా అరుగుమూల రాతిగోడను బల్లిలా కరుచుకునుంచొని తలకాయ ప్రక్కకుతిప్పి చంటిపిల్లవాడిలా ఏడుస్తున్నాడు.

ప్రసూన నిల్పోలేక కూర్చొని 'మమ్మెవ్వరి కప్పగించావే అక్కా.... మేమెవరిని రాజమ్మా

అని పిలవమే-ఈ బిడ్డకూడా నీ కక్కర్లేక పోయిందంటే -అక్కయ్య' అంటూ రాగాలు తీయ నారంభించింది.

రాజమ్మ పసుపుకుంకంతో లక్ష్మీదేవిలా వెళ్ళిపోయిందని ఆ వాడకట్టు స్త్రీలంతా చెప్పుకోసాగారు. చాకళ్లు స్నానం చేయించిన పీటా రాజమ్మ కప్పుకున్న దుప్పటీ తలక్రింద దిండ్లూ దులుపుకుని ఓమూల చేరుస్తున్నారు. గదిలో పిల్లి నిన్ననగా గ్లాసులో కలిపి పట్టకుండా ఉంచిన గ్లూకోజు నీళ్లు, సగం వొదిలిన బత్తాయి పండు తొనలను గుటకాయి స్వాహా చేస్తున్నది. దూరాన ఆకాశాన ఎర్రటి నిప్పుబంతిలా వెలుగుతూన్న సూర్యబింబంసైతం క్రమేణా అలుముకొస్తూన్న నల్లటిమేఘాల కెరయై కూర్చుంది.

▯

గోడని కర్చుకున్న తారకం అట్లా బల్లిలా, చిన్నపిల్లవాడిలా నుంచోటాన్ని, నుంచుని దుఃఖించటాన్ని చూచి సహించలేని కన్యాహస్తం అతడి అరచేతిని గోడమీంచి తనవైపుకు త్రిప్పుకుంటూ 'రా బావా! అంతా ఐపోయింది. అక్క వెళ్ళిపోయింది' అంటూ గుమ్మందాకా నడిపించుకువెళ్ళింది. లోపలెక్కడో గదిలో వెలిగించిన దీపపుకాంతి గుమ్మందాటి చిన్న అరుగు దాటి మెట్లముందు ప్రసరించింది. ఆ కాంతి నాధారంగా చేసుకుని ప్రక్కకు తిరిగి చూచాడు. అక్కడ ఏమీలేదు. రాజమ్మ చేసిన స్నానమంతా వాహికలుగా రోడ్డుమీదకు ప్రవహించినట్లు చారికలు చెబుతున్నై. తారకం తనలో గొణుక్కున్నాడు. 'ఏమీలేదు. ఇక్కడేమీలేదు' అని. ప్రసూన పరధ్యాసలో అతని హస్తాన్ని ఏమరపాటుగా వదిలి ఒక కాలు గడపమీద వేరొకటి గట్టుమీద వుంచి రెండు క్షణాలు ఆగి, గుర్తుకొచ్చి వెనక్కి తిరిగి చూసింది.

తారకం రాజమ్మ స్నానం చేసిన చోటు దగ్గర ఇంకా ఆ ప్రక్కలా ఈ ప్రక్కలా పడివున్న దర్భలూ తాటాకు పీలికలూ చెత్తచెదారమూ చేత్తో వెదుకుతున్నాడు.

ప్రసూన గడపదగ్గరే నిలబడిపోయింది. ఆ అమ్మాయినీడ బాగా పొడుగ్గావుండి గుమ్మందాటి తారకం తిరుగాడుతూన్న చోటువరకూ పడింది.

తారకం ఒంగుని వెదుకుతూన్నట్లుండిన నీడకూడా ప్రసూన నీడ వరకూ వచ్చి ఆగింది.

ఈ రెండు నీడలూ మాట్లాడుకోసాగినై.

"ఏం పోయింది అలా వెతుకుతున్నావు?" అంది ప్రసూన నీడ.

"పోగొట్టుకున్నాను ఒక వస్తువుని" అంది తారకం నీడ.

"దొరుకుతుందనే ఆశ ఏమన్నా వుందా?" తారకంనీడ అస్పష్టంగా 'లేదు' అనేసి కదలకుండా ఉండిపోయింది.

"మరైతే దేనికీ వెతకటం?"

"వెతకటంలో ఇక్కడే ఇప్పుడే పోగొట్టుకున్నాను గదా అనే దుఃఖోపశమన కారకమైన తృప్తివుంది." అంది తారకం నీడ.

ప్రసూన నీడ జాలిగా తారకం నీడవైపు కదిలింది. ఈ రెండు నీడలూ కలుసుకున్నాక తారకం నీడ గొణిగింది–"నేను పోగొట్టుకున్న వస్తువు వల్ల నీకు నేను చుట్టాన్ని. మనకు ఆ వస్తువు పోవడంతో సంబంధం తునాతునకలయింది. ఇంకా నావైపే కదుల్తావు నేనెవరినని?" ప్రసూన నీడ–నిదానంగా కదుల్తూ "నే నెవరిని?" మళ్ళీ అన్నది. తారకం నీడ ముందుకూ వెనక్కూ ఊగుతూ "నేను వస్తువుని పోగొట్టుకున్నాను" అంటూ ఏడవసాగింది. మొదటనుంచీ విడిగా మసుల్తూన్న ప్రసూన నీడ తారకం నీడ మీద అడ్డంగాపడి జవాబిచ్చింది. "నువ్వు పోగొట్టుకున్న వస్తువు ఇలాగే వుందేమో చూడు" అంటూ.

"అవును...అచ్చంగా యిల్లాగే వుంది" అంటూ తారకం నీడ కదిలింది.

ఈ రెండు నీడలూ దగ్గరకు చేరుకున్నాయి. ఇప్పుడు ఒక్కటే నీడ కనుపిస్తోంది. లోపల్నుంచి చంటిబిడ్డ ఏడుపు వినిపిస్తోంది. ఆతృతగా అంది ప్రసూన 'బావా!' అని. తారకం తలెత్తి చూశాడు. ఒక్క ప్రసూన నిల్చున్న వైపునుంచీ వచ్చే వెల్తురు తప్పితే ప్రక్కలంతా "ఎటుచూస్తే అటు చీకటి."